కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

పటాకులు కాల్చుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 28 : బీజేపీ ఎన్నో కుట్రలు చేసి ఎమ్మెల్సీ కవితను జైల్లో వేసినా అమె కడిగిన ముత్యంలా బయటకు వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌గౌడ్, వెంకట్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల అవుతున్న సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా, పాత బస్టాండ్ చౌరస్తాలో పటాకుల కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఎజాస్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేదిలేదు..

గజ్వేల్, ఆగస్టు 29 : అక్రమ కేసులకు బీఆర్ఎస్ నాయకులు భయపడేదిలేదని, ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టినా ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చేప్యాల రాజేశ్వర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నాయకులు వెంకటేశ్, మహేశ్, కల్యాణ్, రాజు పాల్గొన్నారు.

రాజకీయ కక్షలతోనే కేసులు

చేర్యాల, ఆగస్టు28 : రాజకీయ కక్షలతో బీజేపీ పార్టీ ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసులు నమోదు చేయించిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.విజయ్‌రావు అన్నారు. బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కవితను విజయ్‌రావు ఢిల్లీలోని వసంత్ విహార్‌లో గల బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మేజర్ ధ్యాన్ చంద్ జీవితం ఆదర్శనీయం

గౌరవెల్లిలో క్రీడా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అక్కన్నపేట, ఆగస్టు 28 : ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం నేటి తరం క్రీడాకారులకు ఆదర్శనీయమని అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అసిస్టెంట్ రిటైర్డ్ డైరెక్టర్ నాగిరెడ్డి సిద్దారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడా దినోత్సవ ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు రమణబాబు, నోముల చంద్రారెడ్డి, ఆడెపు శ్రీనివాస్, శంకర్ నాయక్, కృష్ణమూర్తి, రైసా, నస్రీన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రుద్రారంలో బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఏఎంసీ డైరెక్టర్ అభిలాష్‌రావు, స్వాతిక వివాహ వేడుకలు బుధవారం జరిగాయి. వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

-మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) ఆగస్టు 28

విద్యుదాఘాతంతో రైతు మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 28 : స్టాటర్ రిపేరు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డి పల్లి మధిర గ్రామమైన మాధన్నపేటలో బుధవారం చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్న పేట గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ (43) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం షేక్ యాకూబ్‌కు వీరారెడ్డిపల్లి గ్రామ శివారులోని తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. యాకూబ్, రంగమైన యాదగిరి పొలాల వద్ద ఇద్దరివి బోరు మోటర్ స్టాటర్లు పని చేయకపోగా, యాదగిరి స్టాటర్ రిపేరు చేస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు కరెంట్ షాక్‌కు గురై యాకూబ్ అక్కడే కక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అశ్రునయనాలతో జవాన్‌కు అంత్యక్రియలు

గజ్వేల్, ఆగస్టు 28 : ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్ (40) అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో అశ్రునయనాలతో ముగిశాయి. శ్రీనివాస్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రారంభమైన అంతిమయాత్ర గ్రామపంచాయతీ మీదుగా కొనసాగింది. వ్యవసాయపొలం వద్ద దహన సంస్కారాలు నిర్వహించారు.

యోగాసన పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట కమాన్, ఆగస్టు 28 : సిద్దిపేట శివానుభవ మండపంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30న జిల్లా స్థాయి యోగాసన పోటీలు జరుగుతాయని సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పోటీలో పాల్గొనేవారు వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్‌తో పాటు ఫొటోను అందించాల్సి ఉంటుందన్నారు. పాల్గొనే వారు 6302227030 ,9160139 889 , 9000190589 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరులకు నివాళి

సిద్దిపేట కమాన్, ఆగస్టు 28 : విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం నిర్వహించిన పోరాటంలో బషీర్‌బాగ్‌లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాములకు సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో బుధవారం నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, చెప్పాల సంతోశ్, బత్తుల అభిషేక్ పాల్గొన్నారు.

అధ్యాపకురాలు నవతకు డాక్టరేట్

సిద్దిపేట టౌన్,ఆగస్టు 28 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు నవత ఏస్టడీ ఆన్ ఫెర్ఫార్మన్స్ ఆఫ్ సెలక్ట్ పేమెంట్స్ బ్యాంక్స్ ఇన్ ఇండియా అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నది. ఈ సందర్భంగా బుధవారం నవత మాట్లాడుతూ తన పరిశోధనకు మార్గదర్శకులైన విశ్రాంత ప్రొఫెసర్ ప్రశాంత్, తల్లిదండ్రులకు బోధన, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్,ఆగస్టు 28 : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం బుధవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో పాటుగా రాజీవ్ రహదారిపైన వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 11మందిని పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు జడ్జి కాంతరావు ఎదుట హాజరు పర్చగా, విచారణ జరిపి మందుబాబులకు రూ. 14,500 జరిమానా విధించారని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 28 : కుకునూరుపల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంట రుణమాఫీపై వివరాల సేకరణ

గజ్వేల్ : కొడకండ్లలో వివరాలు సేకరిస్తున్న ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు

గజ్వేల్, ఆగస్టు 28 : ప్రభుత్వం ఇటీవల రైతులకు రుణమాఫీ చేయగా చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవసాధికారులు గ్రామాల్లోని రైతులకు నేరుగా కలిసి వారి వివరాలతో పాటు కుటుంబ గ్రూప్‌ఫొటోను తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు, ఏఈవో నర్సింహులు గ్రామంలో పర్యటించి రైతు కుటుంబాలను కలిసి వారి ఫొటోలను సేకరించారు. వీటి ఆధారంగా అర్హతలను బట్టి ప్రభుత్వం నుంచి రుణమాఫీ డబ్బులు సంబంధిత రైతుల ఖాతాలో జమ అవుతాయని ఏడీఏ బాబునాయక్ తెలిపారు.

మద్దూరులో..

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ కానటువంటి రైతులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ యాప్ ను రూపొందించిందని, ఆయాప్ ద్వారా అర్హులైన రైతులను గుర్తిస్తున్నట్లు మద్దూరు మండల వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ అన్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలో అర్హులైన రైతులను గుర్తించేందుకు ఏఈవో రాకేశ్‌తో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో రామకృష్ణ మాట్లాడుతూ మద్దూరు మండలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ కానటువంటి 408 మందిగా గుర్తించినట్లు తెలిపారు. వీరందరి కుటుంబ వివరాలు సేకరించి, వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా తమ ఇండ్లముందుకు వచ్చిన అధికారులకు రైతులు కుటుంబ వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, కుటుంబ సభ్యుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి, ఆగస్టు 28: మండలంలోని అన్ని బ్యాంకుల పరిధిలోని 709 మంది రైతుల కుటుంబ నిర్ధారణ, రేషన్ కార్డు లేని రైతుల విరాలను సేకరించేందుకు రైతుల వద్దకు వెల్లనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితలోని రైతుల వద్దకు ఏఈవోలు నేరుగా వెళ్లి ధ్రువీకరణ చేసి, యాప్‌లో నమోదు చేస్తారని, వ్యవసాయశాఖ అధికారుల, సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ నేతకు నివాళి

నివాళులర్పిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు28 : మండల కేంద్రం జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మారుతి కొత్త వెంకట్ నర్సింహారెడ్డి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు అనారోగ్యంతో ఉన్న మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు ఎక్బాల్‌ను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మునిగడప మా జీ ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, జగదేవపూర్ మాజీ ఎంపీటీసీ కవిత, గ్రామ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.

తుంగ రామస్వామి సేవలు మరువలేనివి

ఆకునూరులో తుంగ రామస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 28 : చేర్యాల ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతో తుంగ రామస్వామి చేసిన కృషిని మరువలేమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య అన్నారు. బుధవారం చేర్యాల మండలంలోని ఆకునూరులో రిటైర్డ్ ఎంఈవో తుంగ రామస్వామి దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై నివాళులర్పించారు. రామస్వామి కుమారులు సీనియర్ జర్నలిస్టు పవన్‌కుమార్, ప్రముఖ వైద్యుడు రఘునందన్‌రాణాలను పలువురు పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ యూత్ డివిజన్ అధ్యక్షుడు శివగారి అంజయ్య, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్, మాజీ సర్పంచ్ తివారి దినేశ్, నాయకులు గోనె హరి, కనకయ్య ఉన్నారు.

ఒకటిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి, ఆగస్టు 28 : సెప్టెంబర్ ఒకటిన ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ అండర్-15 బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మిరుదొడ్డి మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీ వీ రమణ బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎంపిక బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన బాల బాలికల జిల్లా జట్లు సెప్టెంబర్ 14 నుంచి 15వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొంటాయన్నారు. వివరాలకు 97047 46511, 9440 70 3038 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ములుగు, ఆగస్టు 28 : ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కానివ్వొద్దని కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. ములుగు మండలం కొత్తూరులో గూనెవాని కుంటకు చెందిన 9-22 ఎకరాల భూమి ధరణిలో ఓ ప్రైవేట్ కంపెనీకి చెందినట్లుగా చూపిస్తున్నదని వెంటనే చర్యలు తీసుకొని తప్పులను సవరించాలని గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం సిద్దిపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినితపత్రం అందజేశారు. కంపెనీ నుంచివెళువడుతున్న కలుషిత నీటితో పంటలకు, పశువులకు నష్టం జరుగుతున్నదని ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని వినితిపత్రంలో పేర్కొన్నారు.

కుల వివక్షపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

మర్కూక్,అగస్టు28 : శివారు వెంకటాపూర్‌లో జరిగిన బోనాల పండుగలో దళితుల పట్ల కులవివక్ష పాటించిన సంఘటనపై జాతీయ ఎస్సీ కమీషన్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌లో బుధవారం డీబీఎఫ్ ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా దళిత బహుజ ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడారు. బోనాల ఉత్సవాల్లో దళితుల పట్ల కుల వివక్ష, అంటరానితనం పాటించిన శివారువెంకటాపూర్ గ్రామాన్ని గురువారం ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య విచ్చేసి, సంఘటన వివరాలు తెలుసుకోనున్నారని తెలిపారు.

గురుకుల కళాశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చేర్యాల, ఆగస్టు 28 : చేర్యాల పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌బాబు బుధవారం ప్రకటనలో కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్ష

సిద్దిపేట, ఆగస్టు 22 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిద్దిపేట పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్, జిల్లా, డివిజనల్ స్థాయి బృందాలకు కేటాయించిన ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి జరుగుతున్న ఇంటెన్సివ్ ఫీవర్ సర్వే డ్రైవ్, సీజనల్ రోగాలపై సమీక్ష జరిపారు. పెరుగుతున్న జ్వరం కేసులను అరికట్టడానికి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. సీజనల్ ఫీవర్స్‌ను ఎదుర్కోవడం, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంపై దృష్టి పెట్టడం, సమర్థమైన నిర్వహణ, నియంత్రణ చర్యలపై నిపుణుల మార్గదర్శకతను అందించడం, జిల్లా, డివిజనల్ స్థాయి బృందాల మధ్య సమన్వయాన్ని పెంచడం తదితర వాటిపై చర్చించారు.

గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ వాసాల

మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్ వాసాల

హుస్నాబాద్, ఆగస్టు 28: హుస్నాబాద్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నిబంధనలను విధిగా పాటించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సతీశ్ వాసాల అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ కమిటీ సెప్టెంబర్ 6వ తేదీ వరకు పోలీసు శాఖ వారు సూచించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలు నిషేధమని, రెండు లౌడ్ స్పీకర్లు మాత్రమే వాడాలని, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు వాటిని వాడకూడదని సూచించారు. మండపాల వద్ద కరెంటు కోసం అనుమతి, రోడ్లను బ్లాక్ చేయొద్దని, సీసీ కెమెరాలు బిగించుకోవాలని, ఫైర్ సేఫ్టీ పాటించాలన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, సహకరించాలని ఆయన కోరారు.

సీడ్ కంపెనీని సందర్శించిన యూపీ మంత్రి

బండమైలారంలో సీడ్ కంపెనీని సందర్శించిన యూపీ

ములుగు, ఆగస్టు 28: ఉత్తరప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి సూర్య ప్రతాప్ సాహి మండలంలోని ఓ సీడ్ కంపెనీని తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. సీడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ టెస్టింగ్, స్టోరేజీ సంబంధించిన విషయాలను కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. యూపీ ప్రిన్సిపాల్ సెక్రటరీ అవనీష్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి రాధిక, ఏడీ అనిల్ కుమార్, ఏమో ప్రగతి తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

గజ్వేల్, ఆగస్టు 28 : విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈదశలో గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సీఐ సైదా సూచించారు. బుధవారం జీఎంఆర్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించి సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, ఆగస్టు 28 : యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కొమురవెల్లి ఎస్సై రాజ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఇటీవల నమోదైన గంజాయి కేసులో ఇరువురు మైనర్లు ఉండగా వారిని కౌన్సెలింగ్ కోసం సిద్దిపేటలోని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.

తొగుటలో..

తొగుట, ఆగస్టు 28 : టీనేజ్‌లో యువతీ, యువకులు జాగ్రత్తగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. తొగుట జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రవికాంతరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల ధర్నా

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28 : ప్రభుత్వ అనుమతి లేకుండా, అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో శ్రీ చైతన్య పేరుతో పాఠశాల, హాస్టల్ ఎలా నిర్వహిస్తారని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మండిపడ్డారు. బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిద్దిపేట బైపాస్ రోడ్‌లో ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ప్రైవేట్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలో ధర్నా నిర్వహించారు. తక్షణమే ఈ బిల్డింగ్‌లో నుంచి పాఠశాల, హాస్టల్‌ను తరలించాలని హెచ్చరించారు. రంగధాంపల్లి గ్రామ శివారులో చెరువు శిఖం భూమిలో(బఫర్ జోన్‌లో) నిర్మాణం చేసిన పాఠశాలను హైడ్రాలో భాగంగా కూల్చి వేసే లా అధికారులను కలెక్టర్ ఆదేశించాలని డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేతకు సిద్ధమా ?

హుస్నాబాద్, ఆగస్టు 28: హుస్నాబాద్ పట్టణంలో పలు కుంటలు, నాలాలు, కాల్వలను ఆక్రమించి ప్రభుత్వ భవనాలతో పాటు మార్కెట్ యార్డు, ఇతర ప్రైవేటు భవన నిర్మాణాలు జరిగాయని, వీటి కూల్చివేతకు స్థానిక కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రశ్నించారు. బుధవారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, సీనియర్ నాయకులు సుధాకర్, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలి

సిద్దిపేట, ఆగస్టు 28 : ప్రైవేటు యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయాలని, సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి అన్నారు. యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాల్సినటువంటి ప్రభుత్వాలు యూనివర్సిటీలను నీరు కార్చే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సందీప్, నాగేశ్ , తిరుపతి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి రవి, సహ యకార్యదర్శులు రంగస్వామి, సూరి , తిరుపతి, గణేశ్ , వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శేఖర్, రవి, అల్తాఫ్, రాకేశ్, రాజేశ్, సాభన్, రేణుక, మౌనిక, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆకునూరులో బీరప్ప, చౌడలమ్మకు బోనాలు

బీరప్ప, చౌడలమ్మలకు బోనాలు తీసుకెళ్తున్న గొల్లకురుమలు

చేర్యాల, ఆగస్టు 28 : చేర్యాల మండలంలోని ఆకునూరు గొల్లకురుమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గొల్లకురుమల కులదైవాలైన బీరప్ప, చౌడలమ్మలకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గొల్లకురుమ కుల పెద్దలు పాల్గొన్నారు.

పరామర్శ..

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 28 : ఈ నెల 26న అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని బేగంపేట గ్రామంలో కుక్కలదాడిలో అన్నెమైన అనుషిత అనే మూడేండ్ల చిన్నారి తీవ్రమైన గాయాలై హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నది. బుధవారం బేగంపేట మాజీ సర్పంచ్ అనసూయ ప్రతాప్ చిన్నారి ని పరామర్శించి, తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై వర్క్‌షాప్

గజ్వేల్, ఆగస్టు 28 : ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో కామర్స్, ఎకనామిక్స్ విభాగధిపతులు డాక్టర్ బాలచంద్రన్, కస్తూరి బాయ్ సంయుక్తంగా బుధవారం ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాపును కళాశాలలో నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులకు స్టాక్ మార్కెట్‌లకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు. ఫైనాన్షియల్‌గా విద్యార్థులకు ఉన్నటువంటి ఉన్నత విద